ఇసుక రవాణాకు అనుమతులు: కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌ల నుంచి 'మన ఇసుక -మన వాహనం' పథకం కింద రవాణాకు అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో జిల్లాస్థాయి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గృహ అవసరాల నిమిత్తం ఇసుక కావల్సిన వారు మన ఇసుక-మన వాహనం ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ఇసుక రవాణాను రెండు, మూడు రోజుల్లో ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. గనులశాఖ ఏడీ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 7 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, వాటిలో ప్రస్తుతం మాగనూరు మండలం వర్కూర్‌లో మూడు, మక్తల్ మండలం దాసర్‌దొడ్డిలో ఒక రీచ్‌లో ఇసుక అందుబాటులో ఉందని, ఈ నాలుగు రీచ్‌లలో మొత్తం 65,554 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు భూగర్భ జల వనరుల శాఖ అధికారులు నివేదిక ఇచ్చారని తెలిపారు. కొత్తపల్లి, లింగాల్‌చేడ్, నందిగామ, నాగిరెడ్డిపల్లి రీచ్‌లలో వర్షాల కారణంగా రవాణా సాధ్యం కాదని తెలియజేశారు. గనులు, భూగర్భజలశాఖ అధికారులు, తహసీల్దార్లు రీచ్‌లు పరిశీలించారన్నారు. ఇదివరకు జిల్లాలో కొనసాగించిన ఆన్‌లైన్ ఇసుక బుకింగ్, అనుమతులు, ఓటీపీ, రవాణా తదితర అంశాలపై కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఇది వరకు ఉన్న ఇసుక విధానాన్ని అధ్యయనం చేయడానికి ఉపకమిటీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టా భూముల్లో ఇసుక రవాణాకు సంబంధించి ఆయాశాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని సూచించారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, భూగర్భజల వనరులశాఖ అధికారిణి రమాదేవి, డీపీఓ కృష్ణ పాల్గొన్నారు.

వంతెన మొదలెట్టకుంటే ఉద్యమం

● భాజపా నేతల స్పష్టీకరణ ● కడా అధికారికి వినతిపత్రం



ఈనాడు మీ తోడు

కడంపల్లి వంతెన నిర్మించాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భాజపా నియోజకవర్గ నాయకులు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : కోస్గి మండలం కడంపల్లి శివారులో వాగుపై వంతెన లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో పలుగ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడంపల్లి, హన్మాన్‌పల్లి, బలభద్రాయపల్లి, వడ్డు కిందితండా, దానిమ్మతండా, చింతగట్టుతండా భక్తిమళ్ల గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడుతున్నారు. కడంపల్లి వాగుపై వంతెన నిర్మిస్తే ప్రజలు సులువుగా కోస్గికి చేరుకుంటారు. వానాకాలంలో చుట్టూ తిరిగిరావాల్సిన పరిస్థితి తప్పిపోతోంది. ఈ సమస్యపై 'ఈనాడు' ఉద్యమస్ఫూర్తితో కథనాలు ఇచ్చింది. స్పందించిన అధికారులు నిధులున్నాయని, పనులు మొదలుపెడతామంటూ చెప్పుకొస్తున్నా ఇంకా పురోగతి లేదు. దీనిపై వివిధ పక్షాలు, ప్రజా సంఘాలు కదులుతున్నాయి. ఈ సమస్య తొందరగా పరిష్కరించాలని ఈ మధ్య భారాస నాయకులు కొడంగల్ ప్రాంతీయాభివృద్ధి సంస్థ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తాజాగా శుక్రవారం భాజపా కొడంగల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి బంటు రమేశ్ సారథ్యంలో నాయకులు కడా అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కడంపల్లి వాగుపై వంతెన నిర్మిస్తామని గత పాలకులు ఎన్నికల్లో హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఈ విషయాన్ని అత్యవసరంగా తీసుకుని వంతెన నిర్మించాలని భాజపా నాయకులు కోరారు. లేనిపక్షంలో భాజపా తరుపున పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, సర్వేశ్వర్, రవీందర్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు పూర్వవైభవం తెద్దాం

న్యూస్‌టుడే- మక్తల్ పట్టణం

ఒకప్పుడు వెలుగు వెలిగి ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ మార్కెట్లలో ఒకటైన మక్తల్ మార్కెట్ కమిటీకి రాజకీయ పీడపట్టి కుదేలైపోయింది. 1995 వరకు సాలీనా రూ.3 కోట్ల ఆదాయం సమకూరే పరిస్థితి నుంచి ప్రస్తుతం రూ.10లక్షలకు పడిపోయే స్థాయికి చేరింది. దీనికి కేటాయించిన రూ.కోట్ల స్థలాలు అధికారికంగా అన్యాక్రాంతం అయ్యాయని చెప్పవచ్చు. పైగా ఆక్రమణలతో మార్కెట్ కుంచించుకుపోయింది. ఈ విషయమై శుక్రవారం 'ఈనాడు'లో 'అందినోళ్లకు అందినంత' శీర్షికన వెలువడిన కథనం మక్తల్ పట్టణంలో చర్చనీయాంశమయ్యింది. పలువురు నాయకులు, అధికారులు స్పందించారు. 35 ఏళ్లపాటు ఉచ్ఛస్థితిలో ఉన్న రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. మార్కెట్‌కు పూర్వవైభవం తెడానికి కృషి చేస్తామని చెప్పారు.


అందినోళ్లకు అందినంత
మక్తల్ మార్కెట్‌ను మింగేశారు

18న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

ఈనాడు కథనానికి స్పందన

వ్యాపారులు కలిసి రావాలి



వ్యవసాయ మార్కెట్ పునరుద్ధరణకు వ్యాపారులు తోడ్పడాలి. మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తులు తప్ప వేరే వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. మార్కెట్ ఆస్తులను సంరక్షించి. స్థానికంగా ఉత్పత్తులు విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. **- వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్.**

అధికారులకు నివేదించాను



మార్కెట్ ఒకప్పుడు ఊరి శివారులోని పొలంలో ఉండేది. ఈ ప్రాంతం అంతా అభివృద్ధి చెందడంతో నడిబొడ్డు అయిపోయింది. ఇక్కడి స్థలాలకు విపరీతమైన గిరాకీ ఉండటంతో మార్కెట్ స్థలం కబ్జాలకు గురవుతోంది. ఈ విషయాన్ని పై అధికారులకు నివేదించాను. రూ.60లక్షలతో రక్షణ గోడ నిర్మించాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్మించాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే మార్కెట్‌లో వేరే వ్యాపారాలు నిర్వహించకుండా అడ్డుకుంటాం. **- చంద్రశేఖర్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్**

మార్పులు చేస్తే పూర్వవైభవం



గతంలో రోజుకు సగటున 5వేల బస్తాల వేరుశనగ కొనుగోళ్లు జరిగేవి. రాయచూరు నూనెమిల్లు యజమానులు వచ్చి అధిక ధరలకు కొనేవారు. మద్దూరు, దామరగిద్ద ప్రాంతాల నుంచి జొన్న, సజ్జ, కందులు, పెసర వచ్చేవి. ధాన్యం కొనాలంటే రెండు రోజులు పట్టేవి. కృష్ణాలో ఉపకమిటీ ఏర్పాటు చేశాం.. ఇప్పుడు పరిస్థితి చూస్తే బాధ కలుగుతోంది. లైసెన్సుదారులను పిలిచి ధాన్యం కొనాలి. కొత్త లైసెన్సులు జారీచేసి ఔత్సాహికులను ప్రోత్సహిస్తే పూర్వవైభవం వస్తుంది. **- కొత్త శ్రీనివాస్‌గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్**

నిజమైన వ్యాపారులను ప్రోత్సహించాలి



అప్పట్లో వేరే వ్యాపారాలు చేసేవారికి నోటీసులు ఇచ్చి తొలగించాం. రూ.3కోట్ల వ్యయంతో 27దుకాణ సముదాయాలు నిర్మించి నెలకు రూ.2లక్షల ఆదాయం వచ్చేలా చూశాం. కొత్త పాలక వర్గం ఏర్పాటు చేసి నిజమైన వ్యాపారులను ప్రోత్సహిస్తే మార్కెట్ పుంజుకుంటుంది. **- పి.నర్సింహాగౌడ్, మాజీ మార్కెట్ ఛైర్మన్**

ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన



ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ స్థానిక తహసీల్దార్ సతీశ్‌తో కలిసి శుక్రవారం పర్యటించారు. 150 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం పట్టణ శివారులోని సర్వే నంబరు 916, 917లో గల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. పురపాలిక దుకాణాల సముదాయం కోసం ట్యాంక్‌బండ్ వద్ద సర్వే నంబరు 316లో ఉన్న భూమిని చూశారు. సమీకృత గురుకుల పాఠశాలల కోసం గోలపల్లి శివారులో సర్వే నంబరు 126లో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో చరవాణిలో మాట్లాడారు. ఆయా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు పూర్తిస్థాయి నివేదిక పంపించాలని తహసీల్దార్ సతీశ్, సర్వేయర్ రాజన్నలను ఆదేశించారు.

పరీక్షలేమయ్యాయి సారూ...?
రేపు రా బాబూ!

జిల్లా ఆస్పత్రిలో వ్యాధి నిర్ధారణకు రసాయనాల కొరత

న్యూస్‌టుడే- పాతబస్టాండ్(నారాయణపేట)

జిల్లాకేంద్ర ఆస్పత్రిలో రక్త, మూత్రం వంటి సాధారణ పరీక్షలకు రెండు, మూడు రోజులు పడుతోంది. రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసే సౌకర్యం జిల్లా ఆస్పత్రిలో ల్యాబ్‌కు ఉన్నా.. రెండు నెలలుగా రసాయనాలు లేవనే నేపంతో కేవలం 15 రోగనిర్ధారణ పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. సెల్‌కౌంట్స్, సీబీపీలో పలు నిర్ధారణ పరీక్షలను తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటున్నారు. హబ్‌కు పంపిన నమూనాలు పరీక్షించి నిర్ధారణ నివేదికలు రావాలంటే ఒకటి నుంచి రెండు రోజులు పడుతుంది. అప్పటికే రోగం కాస్త ముదరడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటుకు వెళుతున్నారు. జిల్లాలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇలాంటి సమయంలో రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో, తెలంగాణ హబ్‌లో అందించే రోగ నిర్ధారణకు పరీక్షలు ఎంతో కీలకం. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రిలో ల్యాబ్‌కు అవసరమైన రసాయనాలు, యంత్రాలు సమకూర్చడంతోపాటు తెలంగాణ హబ్‌కు పంపే నిర్ధారణ పరీక్షలు అదే రోజు జరిగే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● జిల్లా పరిధిలో 11 పీహెచ్‌సీలు, రెండు ప్రాంతీయ ఆస్పత్రులు ఉన్నాయి. వివిధ మండలాల రోగులు జిల్లా ఆస్పత్రికి పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఉన్న రోగులకే పరీక్షలు కానప్పుడు, వీరికి సత్వర సేవలంటే అత్యాశే అవుతోంది.

వేలల్లో పరీక్షలు: జిల్లా ప్రధానాస్పత్రి ల్యాబ్‌లో నెలకు వేలల్లో రోగ నిర్ధారణ పరీక్షలు అవుతాయి. బయట పరీక్షలు చేయించుకోవాలంటే చాలా డబ్బులతో కూడుకున్నట్లు రోగులు చెబుతున్నారు. ఆస్పత్రిలో రోగ నిర్ధారణకు ఉపయోగించే రసాయనాలకు నెలకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. రసాయనాల కొరత రెండు నెలలుగా ఏర్పడటంతో నేటికీ అవి సమకూర్చడంలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.



నారాయణపేట జనరల్ ఆసుపత్రి

పరిమితికి మించి రోగులు రావడంతోనే..

వంద పడకల ఆస్పత్రి కావడంతో ఒత్తిడి పెరిగింది. రోజుకు 300 మంది రోగులకు సంబంధించి రక్తపరీక్షలు చేయడానికి సరిపడా రసాయనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. రోగులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో చాలా ఇబ్బందిగా మారింది. ఆస్పత్రిలో వివిధ రోగాలకు సంబంధించి 56 రకాల పరీక్షలు చేస్తున్నాం. ఒక్కో రోజు వెయ్యి మందికి పైగా పరీక్షలు చేసుకుంటున్నారు. దీంతో ఇబ్బంది ఎదురవుతోంది. కొత్తగా వైద్యకళాశాల నిర్మాణం పూర్తయ్యింది. త్వరలోనే 390 పడకల జిల్లా ఆస్పత్రిగా కళాశాల పరిధిలోకి తీసుకుంటున్నారు. రోగులకు ఇక మీదట ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

- డా. మల్లికార్జున్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

కాంగ్రెస్‌ది ప్రజాపాలన ప్రభుత్వం

మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, వేదికపై నీలి శ్రీనివాసులు, సంపత్‌కుమార్, సరిత తదితరులు

గద్వాల: తెలంగాణలో నిరంకుశత్వం, నియంతృత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గద్వాలలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణతో పాటు కృష్ణవేణి చౌక్‌లో ఏర్పాటుచేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయం నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.2లక్షలపైన ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉందని అది కూడా చేస్తామన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష మాఫీ చేయని వాళ్లకు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. త్వరలోనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ప్రకటిస్తామని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లా వారే కావడంతో ఇక్కడి రైతులను దృష్టిలో ఉంచుకుని జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతల పథకాలు పూర్తిచేస్తారన్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరితలు మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు..: ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గైర్హాజరవటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంపైనా చర్చించుకోవడం కన్పించింది.

కష్టపడి చదివి.. ఉపకులపతి స్థాయికి ఎదిగి

పీయూ వీసీగా డా.జీఎన్ శ్రీనివాస్ ● నేడు బాధ్యతల స్వీకరణ



పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా రానున్న జీఎన్ శ్రీనివాస్ సాధారణ రైతు కుటుంబంలో పుట్టి.. అంచెలంచెలుగా ఎదిగారు. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివారు. బీటెక్ పూర్తయిన తర్వాత ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైంగా ఉద్యోగం చేస్తూ మరోవైపు సాయంత్రం కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. అనంతరం అంచెలంచలుగా ఎదిగి ఉపకులపతి స్థాయికి చేరారు.

159 మందిలో..: పీయూకి మే 21 నుంచి రెగ్యులర్ ఉప కులపతి లేరు. ఈ పోస్టు కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల నుంచి అర్హత కలిగిన 159 మంది దరఖాస్తు చేసుకోగా చివరికి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ పోస్టుకు డిమాండ్ పెరిగింది. కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసిన తర్వాత ఇక్కడ ఉపకులపతి పోస్టుపై అనేక మంది ఆసక్తి చూపారు. అందులో ప్రభుత్వం అనుభవం కలిగిన ఆచార్యుడికి బాధ్యతలను అప్పగించింది.

కుటుంబ నేపథ్యం: శ్రీనివాస్ స్వస్థలం కరీంనగర్ జిల్లా గంభీరావ్‌పేట మండలం కొత్తపల్లి. తల్లిదండ్రులు నర్సయ్య, ఎల్లవ్వ వ్యవసాయం చేసేవారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు గంభీరావ్‌పేట ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. 1991లో ఎంసెట్ ద్వారా మంచి ర్యాంకు సాధించి జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ విద్యలో ఈఈఈ విభాగంలో చేరారు. 1995లో బీటెక్ పూర్తయిన తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం కింద అధ్యాపకులుగా చేరారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు సాయంత్రం కళాశాల ద్వారా ఎంటెక్ పూర్తి చేశారు. 1997 వరకు సహాయాచార్యులుగా పని చేశారు. 2003లో అనంతపురం జేఎన్‌టీయూలో రెగ్యులర్ పోస్టు కింద అసోసియేట్ ఆచార్యులుగా విధుల్లో చేరారు. 2006లో జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడే పని చేస్తూ 2011లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. 2022లో సీనియర్ ఆచార్యులుగా అర్హత లభించింది. నాటి నుంచి నేటి వరకు అక్కడ పని చేస్తున్నారు. వైస్ ప్రిన్సిపల్‌గా, ప్రిన్సిపల్‌గా, పలు కళాశాలలకు మెంటార్‌గా, పరిశోధన కమిటీ ఛైర్మన్‌గా, పలు పోటీ పరీక్షలకు సభ్యుడిగా, వసతి గృహ మేనేజర్‌గా సేవలు అందించారు.

కొత్త వీసీకి సవాళ్లెన్నో..

పీయూలో పలు సవాళ్లు కొత్త ఉపకులపతికి ఎదురు కానున్నాయి. విశ్వవిద్యాలయం సిబ్బందిపై పూర్తి అజమాయిషీ కరవైంది. కొందరు విధులకు వచ్చినట్లు హాజరు వేయించుకుని బయటకు వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తరగతులపై పర్యవేక్షణ, అధ్యాపకుల అజామాయిషీని పకడ్బందీగా చేయాల్సి ఉంటుంది. లా కళాశాలకు గతేడాది అనుమతి వచ్చినా ఇప్పటి వరకు భవన నిర్మాణం పూర్తి కాలేదు. బాలికల వసతిగృహంలో ప్రస్తుతం ఒక గదిలో 8 మంది ఉంటున్నారు. ఒక గదిలో నలుగురు మాత్రమే ఉండాలి. మరో భవనం నిర్మించినా ఇంతవరకు ప్రారంభించలేదు. పర్యావరణ విద్యకు తరగతి గదుల్లేవు. కొల్లాపూర్, గద్వాల, వనపర్తి పీజీ కేంద్రాల్లో వసతి గృహాల సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

● పీయూకి ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తాను. 29 ఏళ్లుగా బోధనా రంగంలో పని చేస్తున్నాను. అన్ని విభాగాల్లో బాగా పని చేసిన అనుభవం ఉంది. అన్ని అంశాలపై సమగ్రమైన అవగాహన ఉంది. వర్శిటీ అభివృద్ధికి తనవంతు సేవలు అందిస్తాను.

-జీఎన్ శ్రీనివాస్, పీయూ ఉపకులపతి

రూ.1.20 కోట్ల జరిమానా ఏమైనట్లు?

చౌడమ్మకుచ్చ మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోని నాటి ఏడీ

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు బాలనగర్‌లోని ఓ రియల్ వెంచర్‌లో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చారని, ప్రభుత్వానికి రూ.కోట్లల్లో నష్టం వాటిల్లిందని పేర్కొంటూ రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్.. ప్రస్తుతం జనగామ జిల్లా ఏడీగా ఉన్న విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేయటం కలకలం రేపింది. ఆరాతీస్తే ఆయన మహబూబ్‌నగర్ పట్టణం ఎదిర సమీపంలోని చౌడమ్మకుచ్చును అక్రమంగా తవ్వి భారీ మొత్తంలో మట్టి తరలించిన మట్టి మాఫియా, స్థిరాస్తి వ్యాపారిపైనా చర్యలు తీసుకోలేదని, వారి నుంచి జరిమానా వసూలు చేయకుండా ప్రభుత్వాదాయానికి భారీగా గండి కొట్టారని తెలిసింది. విచారిస్తే ఇలాంటివి చాలా వెలుగుచూసే అవకాశముంది.

మట్టి రవాణా : సరిగ్గా రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ చుట్టూ మట్టి మాఫియా రెచ్చిపోయింది. కంటికి కనిపించిన గుట్టలన్నీ కరిగించేసింది. అక్రమంగా మట్టిని తరలించి రూ.కోట్లల్లో సొమ్ము చేసుకున్నారు. 2022 సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఎదిర శివారులో చౌడమ్మకుచ్చును మట్టి మాఫియా చెరబట్టింది. రాత్రింబవళ్లు ఇక్కడి నుంచి మట్టిని టిప్పర్లలో తిరుమల హిల్స్‌లో అప్పటి కీలక నేతకు బినామిగా చెలామణి అవుతున్న ఓ స్థిరాస్తి వ్యాపారి వెంచర్‌కు తరలించారు. ఈ వ్యవహారాన్ని గుర్తించిన ఎదిరవాసులు 'న్యూస్‌టుడే'కు సమాచారం ఇచ్చారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేసి 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పటి మైనింగ్ శాఖ ఏడీ విజయ్‌కుమార్ స్పందించారు. మరుసటి రోజైన 10వ తేదీన తమ సిబ్బందితో వెళ్లి చౌడమ్మకుచ్చతో పాటు మట్టిని తరలించి పోసిన తిరుమల హిల్స్‌లోని వెంచర్‌ను కూడా పరిశీలించారు. టిప్పర్లతో వెంచర్‌లో పోసిన మట్టి ఎత్తు 2.50 మీటర్లు, పొడవు 350 మీటర్లు, వెడల్పు 46 మీటర్లు ఉన్నట్లు కొలతలు వేసి గుర్తించి దాదాపు 60,375 టన్నులు ఉంటుందని తెలిపారు. క్యూబిక్ మీటర్‌కు రూ.20 చొప్పున 10 రెట్ల జరిమానా విధిస్తామని, ప్రభుత్వానికి రూ.1,20,75,000 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ మొత్తం జరిమానాను మట్టి తరలింపునకు కారణమైన వ్యక్తులు, టిప్పర్ల యజమానులపై కేసులు నమోదు చేసి వసూలు చేస్తామన్నారు. నెల రోజులు దాటినా ఏడీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. చర్యలు తీసుకోకపోవడంపై మరోమారు 'న్యూస్‌టుడే' ఏడీ విజయ్‌కుమార్‌ను సంప్రదించగా రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదంటూ మైనింగ్ శాఖ నియమావళిని వివరించే ప్రయత్నం చేశారు.



చౌడమ్మకుచ్చ మట్టి పోసి చదును చేసిన వెంచర్ ఇదే

కార్యాలయంలో కనిపించని దస్త్రాలు : మట్టి తరలింపుపై ప్రస్తుత మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అలాంటి దస్త్రాలు, జరిమానా వసూలు చేసిన దాఖలాలు లేవని స్పష్టంచేశారు. మట్టి తరలించే పనిని జడ్చర్ల, అప్పన్నపల్లికి చెందిన కొందరు టిప్పర్ల యజమానులకు స్థిరాస్తి వ్యాపారి అప్పగించారు. ఒక్కో లోడుకు రూ.2,500 నుంచి రూ.3,000 వరకు ధర నిర్ణయించడంతో రాత్రింబవళ్లు తిరుమల హిల్స్‌లో వెంచర్‌కు మట్టిని తరలించారు. నేతల ఆశీర్వాదంతో కేసులే కాదు.. జరిమానా కూడా చెల్లించకుండా టిప్పర్ల యజమానులు తప్పించుకోవటం గమనార్హం.

తహసీల్దారు కార్యాలయంపై నివేదిక

'ఈనాడు' కథనానికి స్పందన

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం భవనం పెచ్చులూడుతుండటంతో అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ఈనాడు'లో శుక్రవారం 'భీతిగొల్పుతున్న తహసీల్దార్ కార్యాలయం' శీర్షికన చిత్ర కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించారు. నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఈ మేరకు పూర్తి వివరాలతో కలెక్టరుకు నివేదిక పంపారు.

జూరాలకు కొనసాగుతున్న వరద

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద కొనసాగుతోంది. జలాశయంలోకి 71 వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 11 గేట్లు, జలవిద్యుదుత్పత్తి ద్వారా మొత్తం కలిపి 83 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలోకి 45వేల క్యూసెక్కుల చేరుతుండగా దిగువకు 44వేలు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 51 వేలు చేరుతుండగా దిగువకు 45 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మరో రెండు రోజుల పాటు జూరాలకు వరద నిలకడగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మెప్మా సీవో యాదయ్యపై వేటు

పాలమూరు: కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్య వ్యవహారంలో మెప్మా సీవో (కమ్యూనిటీ ఆర్గనైజర్) జి.యాదయ్యపై వేటు పడింది. ఆ విధుల నుంచి ఆయన్ని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల దస్త్రం మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డికి చేరింది. మహిళల పొదుపు సొమ్ము, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల నగదును సొంతానికి వాడుకున్న ఆర్పీ శ్రీలతపై ఠాణాలో కేసు నమోదు చేయడంతోపాటు డబ్బు రికవరీ చేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో డబ్బు దుర్వినియోగంపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనాలతో స్పందించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల పుర కమిషనర్ మహేశ్వర్‌రెడ్డితో కలిసి మెప్మా సీవోలతో సమీక్ష నిర్వహించారు. ఆర్పీ శ్రీలత రూ.కోట్లలో మహిళల సొమ్ము పక్కదారి పట్టిస్తే సీవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కోయనగర్ వ్యవహారంలో సంఘాల సభ్యులు నష్టపోరాదని, అక్రమాలకు పాల్పడ్డ ఆర్పీపై క్రిమినల్ చర్యలు తప్పవని, మిగతా ఆర్పీలపై సీవోలు దృష్టి సారించాలని సూచించారు. ఈ వ్యవహారంపై తుది నివేదిక రాగా కలెక్టర్, అదనపు కలెక్టర్.. మెప్మా ఇన్‌ఛార్జి పీడీ సురేందర్‌రెడ్డితో సమీక్ష నిర్వహించారు. కోయనగర్ సమాఖ్యలో మూడేళ్లుగా జరుగుతున్న అవకతవకలు గుర్తించడంలో సీవో యాదయ్య పూర్తి నిర్లక్ష్యంతో బాధ్యతారాహిత్యంగా పనిచేశారని గుర్తించిన కలెక్టర్ అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

ఆర్టీసీకి దసరా బొనాంజా

16 రోజుల్లో రూ.39.22 కోట్ల ఆదాయం



ఆర్టీసీ ఆదాయ వివరాలు వెల్లడిస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీకి దసరా పండగ సందర్భంగా ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం వి.శ్రీదేవి వెల్లడించారు. శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 16 రోజుల పాటు ఆర్టీసీకి వివిధ డిపోల వారిగా ప్రయాణికుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని వివరించారు. అక్టోబర్ 1 నుంచి 16 వరకు ఉమ్మడి జిల్లా (రీజియన్) వ్యాప్తంగా 740 బస్సులను వివిధ రూట్లలో 52.72 లక్షల కిలోమీటర్లు నడిపి 69.83 లక్షల మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు రూ.39.22 కోట్ల రాబడి వచ్చిందని ఆర్ఎం తెలిపారు. ఇందులో రూ.4.73 కోట్లు టోల్‌ప్లాజా, సెస్, ఇతర వస్తువుల రవాణా ద్వారా, మరో రూ.34.49 కోట్లు ప్రయాణికుల ద్వారా సమకూరిందని వివరించారు. ఈ ఆదాయం ఆర్టీసీకి రీజియన్‌లోనే సరికొత్త రికార్డు అన్నారు. 14వ తేదీ ఒక్క రోజే 138 శాతం ఆక్యుపెన్సీతో రీజియన్‌లో ఆర్టీసీకి రూ.3.33 కోట్ల ఆదాయం వచ్చిందని, ఇది కూడా ఆర్టీసీ చరిత్రలో ఆల్‌టైం రికార్డు అన్నారు. పండగ సందర్భంగా రాష్ట్ర స్థాయిలోనూ మహబూబ్‌నగర్ రీజియన్ 110 శాతం ఆక్యుపెన్సీ సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఆర్ఎం తెలిపారు.

వివిధ డిపోల వారిగా వచ్చిన ఆదాయం ఇలా

డిపో పేరు	కి.మీలు (లక్షల్లో)	ఆదాయం (రూ.లక్షల్లో)
అచ్చంపేట	4.92	315.88
గద్వాల	6.26	415.04
కల్వకుర్తి	6.16	388.36
కొల్లాపూర్	4.21	265.27
కోస్గి	0.73	42.44
మహబూబ్‌నగర్	8.00	519.55
నాగర్‌కర్నూల్	5.06	353.98
నారాయణపేట	5.54	347.10
షాద్‌నగర్	4.83	316.55
వనపర్తి	7.01	485.28
మొత్తం	52.72	3449.45

అండర్-23 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-23 ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన క్రికెట్ జట్లతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ పోటీలకు జిల్లా క్రికెట్ సంఘం శుక్రవారం ఆరు జట్లను ఎంపిక చేసింది. 28వ తేదీ వరకు ఈ ఆరు జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభా చాటిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును ఎంపిక చేస్తామని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ఉంటాయని, ఈ పోటీల్లో ప్రతిభ చాటిన వారిని రంజీ జట్టుకు ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు సురేష్, అశోక్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

వేడుక మాటున వేదన





న్యూస్‌టుడే- కోస్గి, పాతబస్టాండ్(నారాయణపేట)

డీజే శబ్దాలు మరణ శాసనాలుగా మారుతున్నాయి. అతి భయంకర ధ్వనులు చెవులను దెబ్బతీస్తున్నాయి. పలువురు యువకులు వాటి ముందు ఎక్కువ సమయం నృత్యాలు చేయడంతో చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండ డీజేల పట్ల ఆకర్షితులవుతున్నారు. శ్రుతిమించిన ధ్వనులే ఇబ్బందుల పాల్జేస్తున్నాయి.



నారాయణపేటలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేస్తున్న యువకులు

● వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమల్ల గ్రామంలో 28 ఏళ్ల యువకుడు దసరా ఉత్సవాల శోభాయాత్రలో డీజే శబ్దాల మధ్య నృత్యాలు చేశాడు. ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై మృతి చెందాడు.

● **ధరూర్:** రేవులపల్లిలో ఇటీవల డీజే శబ్దాల మధ్య బతుకమ్మలను ఊరేగిస్తుండగా సౌండ్ తగ్గించాలని ఓ వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. అతనితో ఊరేగింపు నిర్వాహకులు గొడవపడ్డారు. వారించడానికి వచ్చిన ఆర్మీ జవాన్‌ను కత్తితో పొడిచారు.

మీకు తెలుసా..?

● మహారాష్ట్రలోని గాంధీ చౌక్ వద్ద జరిగిన ఓ ఉత్సవంలో ఎక్కువ సంఖ్యలో డీజేలను ఏర్పాటు చేశారు. వాటి శబ్ద ప్రభావంతో 250 మంది చెవిపోటుకు లోనయ్యారు. వీరిలో చాలా మందికి చెవుడు వచ్చింది.

చెవులు చిల్లులు

బ్లూటూత్, రిమోట్ వంటి పరికరాలతో డీజేలను నియంత్రించే పద్ధతి రావడంతో శబ్ద కాలుష్యంతోపాటు రేడియేషన్ ప్రభావం ఉంటోంది. మానసిక సమస్యలు, వ్యాకులత కూడా కలుగుతున్నాయి.

శబ్ద తీవ్రతను డెసిబుల్స్‌లో కొలుస్తారు. డెబ్బై డెసిబుల్స్ తీవ్రత ఉన్న శబ్దాలను చెవులు తట్టుకోగలుగుతాయి. ఆపై పెరిగితే ప్రమాదం తప్పదు. 80 నుంచి 100 డెసిబుల్స్ మధ్య చెవుడు వచ్చే ప్రమాదం ఉంది. వంద నుంచి 120 డెసిబుల్స్ మధ్య రక్తపోటు పెరిగి గుండె లయ తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. మనుషులే కాదు పశుపక్ష్యాదులపై ధ్వని ప్రభావం చూపుతుంది.

మన జిల్లాలో వినాయక, బతుకమ్మ, దుర్గామాత ఉత్సవాల్లో సౌండ్‌బాక్స్‌లను పెద్దఎత్తున వినియోగిస్తున్నారు. పల్లెల్లోనూ కొంతమంది డీజేలను కొనుగోలు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ప్రాంతం బట్టి, ఉపకరణం స్థాయిని అనుసరించి రూ. 20 నుంచి రూ. 80 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

మనం ఏం చేయాలి?



● చిన్న శబ్దంతో డీజేలు వాడుకుంటే ఇబ్బంది ఉండదన్న విషయాన్ని యువతకు అవగాహన కల్పించాలి.

● చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన సరదా కోసం ఎదుటివారి జీవన హక్కును దెబ్బతీసినట్లేనని గుర్తించాలి. అర్ధరాత్రి మోతమోగిస్తే ఎక్కువమందికి నిద్రాభంగం కలుగుతుంది.

● ఉమ్మడి జిల్లాలో పోలీసులు డీజే శబ్దాలపై ప్రకటనలు చేస్తున్నా, వాస్తవానికి పట్టించుకోలేదు. కొన్ని చోట్లయితే ఎవరైతే ఫిర్యాదు చేస్తారో వారిపేరును నిర్వాహకులకు చెప్పిన సందర్భాలు ఉన్నాయి.

నిబంధన అమల్లో ఉంది



హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో డీజేలపై నిషేధం ఇప్పటికే అమల్లో ఉంది. పోలీసులు ఎంతచెప్పినా పౌరసమాజం, ప్రజాసంఘాలు కలిగించుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదు. డీజేల నిర్వాహకులతో కమిటీ ఏర్పాటు చేసి శబ్దకాలుష్యం వల్ల అనర్థాలపై అవగాహన కల్పిస్తాం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

\- నల్లపు లింగయ్య, డీఎస్పీ, నారాయణపేట

చెవుడు వచ్చే ప్రమాదం



ఎక్కువ శబ్దం, ఎక్కువ సేపు వింటే తరంగాలు చెవుల్లో మోత మోగించడంతోపాటు కర్ణభేరి దెబ్బతింటుంది. వినికిడి సమస్యలు తలెత్తుతాయి. మానసిక ఒత్తిడి, వ్యాకులత పెరుగుతుంది. ఇది మానసిక సమస్యలకు దారితీస్తుంది. చెవుడు వంటి సమస్యలతో పాటు, గుండె పోటుకు ఆస్కారం ఉంటుంది. హృదయ సమస్యలు ఉన్నవారు ఎక్కువ శబ్దాలను వినలేరు. వారిని దృష్టిలో ఉంచుకోవాలి. మెదడు దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వీలైనంత వరకు తక్కువ శబ్దాలతో, ప్రశాంతమైన వాతావరణంలో వేడుకలు చేస్తే మంచిది.

\- డా.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్యుడు.

292 సెక్షన్ బీఎన్ఎస్ కింద శిక్షార్హులు



పరిమితికి మించిన శబ్దకాలుష్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సెక్షన్ 292 బీఎన్ఎస్ కింద శిక్షార్హులవుతారు. వాణిజ్య ప్రాంతాలు, జనసంచారం ఉండే నివేశాల్లో ఉదయం, రాత్రి వేళల్లో నిబంధనలకు లోబడి శబ్దం ఉండాలి. పరిమితికి మించి శబ్దం పెంచితే రూ.200 నుంచి రూ.2వేల వరకు కోర్టు జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రజాజీవనానికి భంగం కల్గిస్తే మరికొన్ని తీవ్ర శిక్షలు, సెక్షన్లు వర్తిస్తాయి.

\- కె.రాజశేఖర్, న్యాయవాది నారాయణపేట

చెల్లియో చెల్లక



బాబూ! ఈ పది రూపాయల బిళ్ల తీసుకుని చెరుకు రసం ఇవ్వు.
కుదరదమ్మా.. అది చెల్లదు. నోటు ఉంటే ఇవ్వు...
అదేంటి బాబూ
ఎల్లి గవర్నమెంట్‌ను అడుగు...
\- ఇలాంటి సన్నివేశాలు ఉమ్మడి పాలమూరులో చాలాచోట్లు చూస్తూనే ఉన్నాం.
పది రూపాయల నాణేలు ఎంచక్కా వాడుకోవచ్చు.
ఎవరైనా అభ్యంతరం పెడితే ఫిర్యాదు చేసే వీలుంది.

న్యూస్‌టుడే- ఊట్కూరు, పాలమూరు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పదిరూపాయల నాణేలు తీసుకోవడం లేదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ● ప్రయాణికులు ఇచ్చే రూ. 10 నాణేలను తీసుకోవాలని ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లను ఆ సంస్థ యాజమాన్యం ఆదేశించింది. ఫిర్యాదు నేపథ్యంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కార్యదర్శి గత నెల 29న ఆయా డిపో మేనేజర్లకు ఆదేశాలను జారీ చేశారు. ● మక్తల్ పట్టణంలోని కొన్ని పెట్రోలు బంకుల్లో కూడా రూ. 10, రూ.20 నాణేలను తీసుకోవటం లేదని వినియోగదారులు వాపోతున్నారు. అవగాహన రాహిత్యం వల్ల కొంత మంది ప్రజలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

అసలేం జరిగింది

పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకున్న తర్వాత రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో కొత్త రూ.2వేలు, రూ.500 విడుదల చేశారు. పెద్దనోట్ల రద్దు అనంతరం ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయాల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకని చాలామంది బయట ఎవరూ తీసుకోవడం లేదనే వదంతులు లేపారు.

బ్యాంకుల్లో రూ.16 కోట్ల నాణెలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. 16 కోట్ల విలువైన రూ.10 నాణేలు ఉన్నాయి. పలు ప్రైవేటు, అనుబంధ సంస్థల బ్యాంకులలో మరో రూ. 10 కోట్ల నాణేలు ఉన్నట్లు బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఎస్‌బీఐ బ్యాంకుల్లో రూ.2.5 కోట్ల రూ.10 నాణెలు, యూనియన్ బ్యాంక్‌ల్లో రూ. 2కోట్లు నాణేలు ఉన్నట్లు ఆ వర్గాల సమాచారం.



మహబూబ్‌నగర్‌లో దుకాణదారులకు రూ.10 నాణెంపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

అవగాహన విస్తృతం చేయాలి



మా దుకాణానికి సరకుల కోసం వచ్చే కొంత మందికి రూ. 10 నాణెం ఇస్తే తీసుకోవటం లేదు. ఎంత చెప్పినా ససేమిరా అంటున్నారు. కొంత మంది తీసుకెళ్లి, ఎవ్వరూ తమవద్ద తీసుకోకపోతే తిరిగి ఇస్తున్నారు. ప్రజల్లో అపోహలు తొలగిపోవాలంటే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు పెడుతున్నారు. అందులో ఈ విషయం చెప్పాలి. షీటీంలు, ఇతరశాఖల అవగాహన సదస్సుల్లో ఇదో అంశంగా చేస్తే బాగుంటుంది.

\- ఎస్.మధుకర్, కిరాణా దుకాణదారుడు, ఊట్కూరు.

నిరాకరిస్తే ఫిర్యాదు చేయండి



దుకాణదారులైనా, వ్యాపార సంస్థలైనా , వ్యక్తులైనా రూ.10, రూ.20 నాణేలను తీసుకునేందుకు నిరాకరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు దగ్గరలోని పోలీసు స్టేషన్‌లోనో, లేదా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చు. అందరం కలిసి అసత్య ప్రచారాలను ఆపుదాం.

\- కాల్వ భాస్కర్, లీడ్ బ్యాంకు మేనేజర్, మహబూబ్‌నగర్.

'పాలమూరు'పై సీఎంకు చిత్తశుద్ధి ఏదీ?: నాగం



నాగర్‌కర్నూల్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి

కందనూలు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి నార్లపూర్, వట్టెం, కర్వెన జలాశయాలను నీటితో నింపాలని మాజీ మంత్రి డా. నాగం జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి దాదాపు 9 నెలలు దాటినా కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన మూడున్నర కిలో మీటర్ల సొరంగం పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం ముగిసే వరకు పనులు త్వరగా పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలన్నారు. లేని పక్షంలో డిసెంబర్ 9న కూడికిళ్ల వద్ద నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అకాల వర్షాలతో పత్తి సాగు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పంట నష్టపరిహార నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపించాలన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ, హైడ్రా పరిపాలన బందు చేసి ప్రజా పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిధిలోని కాల్వల ద్వారా 5 వేల క్యూసెక్కుల నీరు వెళ్లేలా వెడల్పు చేయాలన్నారు. జిల్లాలోని మంత్రి, ఎమ్మెల్యేలు స్పందించి పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయించడానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు డా. నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, తిమ్మాజిపేట పాండు, బాలగౌడ్, ఐతోలు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు ప్రభావంతో రైతు మృతి

మల్దకల్, న్యూస్‌టుడే: పత్తి పొలానికి పురుగు మందు పిచికారీ చేసిన రైతు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందిన ఘటన మల్దకల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మంగళి ఆంజనేయులు(46) గురువారం తన పత్తిపొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేశాడు. దీంతో రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు చికిత్సకు కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందినట్లు తెలిపారు. ఆంజనేయులుకు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వివరించారు.

బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



శైలేష్

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వెన్నచర్ల, రాయిపాకుల దారిలో శుక్రవారం ఉదయం బస్సు, బైకు ఢీకొన్న ఘటనలో వెన్నచర్లకు చెందిన సంపంగి హన్మంతు చిన్నకుమారుడు సంపంగి శైలేష్ (18) మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. వెన్నచర్ల నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్న శైలేష్ బండరాయిపాకుల సమీపంలో బస్సును అధిగమించబోయి ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన యువకుడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

పిడుగు పాటుకు కూలీ...



సంగమ్మ

మరికల్ కూడలి : పిడుగు పడి ఓ వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మరికల్ మండలం కన్మనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మరో ఇద్దరు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం... శెర్నపల్లి గ్రామానికి చెందిన రైతు కన్మనూర్ శివారులో కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. కర్ణాటక రాష్ట్రంలోని గురిమిట్కల్ తాలుకా పరిధిలోని అన్పూర్ గ్రామానికి చెందిన మహిళలను పత్తి తీసేందుకు శుక్రవారం తీసుకొచ్చాడు. మధ్యాహ్నం వర్షం పడడంతో వారు ఓ చెట్టు కిందకు చేరారు. ఆ సమయంలో పిడుగు పడగా బోయ సంగమ్మ(45) అనే మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. మల్లమ్మ, అల్లమ్మ అనే మహిళలకు గాయాలై అస్వస్థతకు గురయ్యారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే కూలీలను తీసుకొచ్చిన వాహనంలోనే మృతదేహం, గాయపడిన వారిని తరలించారు.

బాలిక హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

సదాశివపేట: బాలిక హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సెషన్ జడ్జి జి.భవానీచంద్ర శుక్రవారం తీర్పు ఇచ్చారు. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం ఇబ్రహింపల్లికి చెందిన వీరేశం భార్య కల్పన మూడేళ్ల కూతురు భవ్యతో కలిసి గతంలో ప్రసవానికి షాబాద్ మండలం బోడపహాడ్ పుట్టింటికి వెళ్లింది. అక్కడ రాజుతో పరిచయం ఏర్పడి అక్కడే ఉండిపోయింది. కాన్పు అనంతరం చిన్నకూతురు, పెద్ద కూతురు భవ్య, ప్రియుడితో కలిసి సదాశివపేట పట్టణం ప్రియదర్శిని కాలనీకి మకాం మార్చారు. భవ్య తనను నాన్న అని పిలవడంలేదని రాజు ఆగ్రహంతో చిన్నారిని గోడకు కొట్టడంతో మృతి చెందింది. ఈ ఘటన 26 ఫిబ్రవరి 2019లో జరిగింది. ఈ విషయం తండ్రి వీరేశానికి తెలియడంతో కూతురు మరణంపై అనుమానం ఉందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ.. కల్పన, రాజుపై కేసు నమోదు చేసి విచారించగా, నిందితులు నేరం అంగీకరించడంతో వారిని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారని వివరించారు.

పీయూలో సౌత్‌జోన్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పాలమూరు, న్యూస్‌టుడే: పాలమూరు విశ్వవిద్యాలయంలో సౌత్‌జోన్ పోటీల కోసం ఎంపికలను నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీయూలో బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను పురుషుల విభాగంలో నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీరాములు (కొల్లాపూర్), జగదీశ్ (నారాయణపేట), బడేసాబ్ (మహబూబ్‌నగర్), శివకృష్ణ (నారాయణపేట), రాకేశ్ (మహబూబ్‌నగర్) తదితర క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. పీడీలు సత్య భాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేశ్, మన్యం పాల్గొన్నారు.

క్రీడాకారుల్లో నైపుణ్యం వెలికితీతకే సీఎం కప్



సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం కప్ మంచి వేదిక అని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సీఎం కప్ టార్చ్ ర్యాలీకి కలెక్టర్ స్వాగతం పలికారు. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణ నుంచి లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ కొనసాగింది. ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌తో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత క్రీడా సాధనతో శారీరకంగా దృఢంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి(25) శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు



ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00



తెరపై ఈనాడు

దేవర: మనోహర్(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంజ(కోస్గి), **విశ్వం:** మహేశ్వరి (నారాయణపేట), రామచంద్ర (మక్తల్) - న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం, కోస్గి గ్రామీణం

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ.70, వంకాయలు రూ.60, ముల్లవంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకర కాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీర కాయలు రూ.80, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.80, గోకరకాయ రూ.70, క్యాప్సికం 80, బీన్స్120, క్యాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60, క్యాబేజీ రూ.50, ఆల్లి రూ.50, చింతకాయ రూ.110. -న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)



బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎల్‌వోసీ అందజేత

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండలంలోని తిప్రాస్‌పల్లి గ్రామానికి చెందిన పరశురాం రోడ్డు ప్రమాదంలో గాయపడి, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.90 లక్షల సీఎం సహాయ నిధి పత్రాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లేష్, రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరి కుంభోత్సవం

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని చౌడేశ్వరీ మాత దేవాలయం వద్ద శనివారం నుంచి రెండ్రోజుల పాటు కుంభోత్సవం వేడుకలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం జల్లిబిందె ఊరేగింపు, ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని చెప్పారు. 20న కుంభోత్సవం వేడుకలు ఉంటాయన్నారు.

1న భగవద్గీత కంఠస్థ పోటీలు

ధన్వాడ, న్యూస్‌టుడే : తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలను నవంబరు 1న మరికల్ పట్టణంలోని శ్రీవాణి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తితిదే ఉమ్మడి జిల్లా కార్యక్రమాల నిర్వాహకుడు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. తితిదే ధర్మాచార్యులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పుర కార్మికులకు వారాంతపు సెలవులివ్వాలి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : పుర కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎస్.కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులతో కలిసి కార్యాలయ ఆవరణ ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. 80 మంది కార్మికులు అవసరం ఉండగా ప్రస్తుతం 40 మంది పనిచేస్తున్నారని చెప్పారు. దీంతో వారిపై అధిక పని బారం పడుతోందన్నారు. కార్యక్రమంలో రాములు, ఈశ్వరయ్య, డోగి అశోక్, రవి, కృష్ణయ్య, జగ్గలి బాబులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేయడం తగదు

పాతబస్టాండ్ (నారాయణపేట), న్యూస్‌టుడే : వివిధ శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఏలను ఇంక్రిమెంటు చేయకుండా పుర కమిషనర్ సునీత ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతేడాది పురపాలికకు 17మంది జూనియర్ అసిస్టెంట్‌లను వార్డు అధికారులుగా ప్రభుత్వం నియమించింది. సంవత్సరం పూర్తి అయిన ఇంక్రిమెంటులో తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోతున్నారు. విషయమై పుర కమిషనర్‌ను వివరణ కోరగా.. డాక్యుమెంటు వెరిఫికేషన్‌లో ఆలస్యం అవుతుందని, త్వరలోనే ఇంక్రిమెంట్ చేస్తామని వివరించారు.

గాంధేయ మార్గాలను అనుసరించండి



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

నర్వ, న్యూస్‌టుడే : గాంధేయ మార్గాలను అనుసరించాలని ఉమ్మడి జిల్లా విశ్రాంత విద్యాధికారి విజయ్‌కుమార్ సూచించారు. బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర 17వ రోజు శుక్రవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, రోజూ ధ్యానం చేసే అలవాటును అలవర్చుకోవాలని చెప్పారు. అనంతరం జీహెచ్ఎం భాగ్యలక్ష్మి, అర్చకులు ప్రవీణ్‌కుమార్, గ్రామస్థుల ఆధ్వర్యంలో విజయ్‌కుమార్‌ను సన్మానించారు.

గాలికుంటు నివారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి ఈశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మరికల్ పట్టణంలోని పశువైద్య కేంద్రం ఆవరణలో నిర్వహించిన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పశువులన్నింటికీ టీకాలు వేయించాలన్నారు. జూనియర్ పశువైద్యాధికారి వాసుదేవుడు, గోపాల మిత్ర శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ఊట్కూరు, న్యూస్‌టుడే : సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆశప్ప, రాములు, చంద్రప్ప తదితరులు ఆరోపించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నర్సింహులు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : కారు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టేకులపల్లి గ్రామానికి చెందిన గుడిసె నర్సింహులు(33) గురువారం రాత్రి మక్తల్ నుంచి వస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాయచూరు వైపు వెళ్తున్న కారు బయో పెట్రోల్ బంక్ వద్ద ఢీకొట్టింది. నర్సింహులు కాలు విరగగా మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. భార్య అనిత, ఆరేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

మహిళల చేతిలో నాటుకోళ్ల పెంపకం

న్యూస్‌టుడే-నారాయణపేట



కుమార లింగంపల్లిలో ఏర్పాటైన కోళ్ల పెంపకం యూనిట్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందిస్తూ వ్యాపారాలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహిళా శక్తి పేరుతో వ్యాపార రంగాల్లో రాణించేందుకు ప్రణాళికతో ముందుకెళుతోంది. అందులో భాగంగా కోడిమాంసం, గుడ్ల డిమాండ్ అధికంగా ఉండటంతో నాటుకోళ్ల పెంపకం వైపు మహిళలను నడిపించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో సంఘాలవారీగా మదర్, వ్యక్తిగత యూనిట్ల అందించడానికి లబ్ధిదారులను ఎంపికచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

● జిల్లాలోని 13 మండలాల పరిధిలో 8 వేలకుపైగా స్వయం సహాయ సంఘాలు ఉండగా, 90వేల మందికి పైగా సభ్యులు ఉన్నాయి. వీరికి ఇది వరకే వివిధ వ్యాపారాల నిర్వహణకు ప్రతియేటా లక్ష్యం నిర్దేశించుకుని రూ.కోట్ల రుణాలను అందిస్తున్నారు. ప్రస్తుతం అధికారులు గ్రామాల్లో పర్యటించి సంఘం సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆ రెండు రకాలకు ప్రాధాన్యం

రాజశ్రీ, ఆసిల్ రకం కోళ్ల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజశ్రీ రకం కోళ్లు 75శాతం, ఆసిల్ రకం 95శాతం నాటు రకం. కుక్కల దాడిని సులభంగా తట్టుకుంటాయి. జిల్లాలో ఇప్పటి వరకు 876 మంది పెంపకానికి ముందుకు వచ్చారు. వీరిలో 429 మందికి 53.62 లక్షల రుణాలు సైతం మంజూరు చేశారు. కోళ్ల పెంపకానికి ముందుకువచ్చిన 677 మందికి ఒకరోజుపాటు ఆయా మండల కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. మదర్ యూనిట్లను ఇప్పుడిప్పుడే ఏర్పాటుచేస్తుండటంతో లబ్ధిదారులకు కేశంపేట, కొత్తూరు, షాద్‌నగర్, రాజేంద్రనగర్ నుంచి కోడి పిల్లలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

1375 కోళ్ల పెంపకం యూనిట్లు...

జిల్లా పరిధిలో 1375 పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు, 11 మదర్ యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మదర్ యూనిట్‌కు రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు రుణం అందిస్తున్నారు. పెరటి కోళ్ల పెంపకానికి సంబంధించి ఒక్కో లబ్ధిదారుకు రూ.12,500 (50 కోళ్ల పెంపకానికి), వంద కోళ్ల పెంపకానికి రూ.22వేలు రుణంగా అందిస్తున్నారు. మదర్ యూనిట్‌లో 2వేల కోడి పిల్లల పెంపకం చేపడతారు. మదర్ యూనిట్లలో నాలుగు నుంచి ఆరు వారాలు కోడి పిల్లలను పెంచిన అనంతరం లబ్ధిదారులకు సరఫరా చేయాల్సి ఉంటుంది.

నాలుగు మండలాల్లో మదర్ యూనిట్లు

ప్రస్తుతం మద్దూరు, దామరగిద్ద, ఊట్కూరు, నర్వ మండల కేంద్రాల్లో మదర్ యూనిట్లకు సంబంధించి షెడ్ల నిర్మాణం జరుగుతోంది. నర్వలో మదర్ యూనిట్‌కు రుణం అందజేసి ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. మిగతా మూడు మండలాల్లో త్వరలోనే షెడ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. మాగనూరు, నారాయణపేట, కోస్గి, మక్తల్ నాలుగు మండలాల్లో మదర్ యూనిట్లను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఈనాడు ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 'ఐంక్రెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ప్రథమ బహుమతి ఉష అశ్విని(పదో తరగతి), ద్వితీయ బహుమతి ఎస్. లక్ష్మి(పదో తరగతి), తృతీయ బహుమతి అస్మా ఫిర్దోస్(తొమ్మిదో తరగతి) అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సింగ్, పీడీ పర్వీన్ బేగం, ఉపాధ్యాయులు వాణిశ్రీ, నాజ్నీన్ బేగం బహుమతులు అందించి అభినందించారు.



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముశ్రీఫా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జగదీశ్వర్ జాతీయస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య, పీడీ పుష్పలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణఖేడ్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో జగదీశ్వర్ ప్రతిభ కనబర్చినట్లు రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు బి.గోపాలం సమాచారం ఇచ్చారన్నారు. 27 నుంచి 30వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారని వివరించారు.

కేంద్ర నిధులతోనే గ్రామాభివృద్ధి



చర్లపల్లిలో భాజపా సభ్యత్వాన్ని అందజేస్తున్న గోవర్ధన్‌గౌడ్

ధన్వాడ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్ర భాజపా కిసాన్ సెల్ కార్యదర్శి జట్రం గోవర్ధన్‌గౌడ్ అన్నారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చర్లపల్లి గ్రామంలో శుక్రవారం పర్యటించి మాట్లాడారు. కేంద్రం ఉచిత బియ్యం పంపిణీని మరోసారి పొడిగించిన విషయాన్ని గుర్తుచేశారు. నాయకులు బాలప్ప, కొండన్న, బాల్‌రాజు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో సత్తా చాటాలి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : సభ్యత్వ నమోదులో సత్తా చాటాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్ పిలుపునిచ్చారు. మరికల్ మండలం మాద్వార్ గ్రామంలో శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. నర్సన్‌గౌడ్ హాజరై మాట్లాడారు. క్రియాశీలకంగా వ్యవహరించే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత స్థానం ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదు మండల కన్వీనర్ వేణుగోపాల్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండలాధ్యక్షుడు నరేష్‌గౌడ్, వడ్డే శ్రీరామ్, శెట్టి మహేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలపై ఫిర్యాదు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : మండలంలోని కన్మనూర్ గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరారు. ఈ మేరకుఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కలెక్టర్ గరిమ నరులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. వరప్రసాద్‌గౌడ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఉమ్మడి జిల్లా స్థాయి కరాటే పోటీలకు ఎంపిక చేసినట్లు కరాటే క్లబ్ వ్యవస్థాపకుడు సలాంబిన్ ఉమర్ తెలిపారు. 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. 14 ఏళ్ల విభాగంలో శ్రావణి, ప్రజ్ఞ, శిరీష, ఉమశ్రీ, ధరణి, అశ్విని, శ్రుతి, చరణ్, కేదార్, కార్తిక్, శ్రీనాథ్, వంశీతేజ, సిద్ధార్థ, హర్షవర్ధన్, నితిన్, విష్ణువర్ధన్ ఎంపికైనట్లు చెప్పారు. 17 ఏళ్ల విభాగంలో అభిలాష్, వీరేంద్ర, కార్తిక్, ముస్తఫా, రుక్సాన, శ్రావ్య, మాయా, వైశాలి, కీర్తిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఈనెల 19న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

మత్స్యశాఖ జిల్లా అధికారి బాధ్యతల స్వీకరణ

నారాయణపేట, న్యూస్‌టుడే : జిల్లా మత్స్యశాఖ అధికారిగా అతికుర్ రహమాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో మత్స్య సంపద పెంచి, మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు కృషిచేయాలని కలెక్టర్ సూచించారు.

24న పంచాయతీ దుకాణాల వేలం

మరికల్ కూడలి: పట్టణంలోని పంచాయతీ దుకాణాల వేలం ఈనెల 24న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16 దుకాణాలకు వేలం వేస్తున్నట్లు, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

ఆలయాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి




పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అలంపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రజలకు సేవలు చేయడానికి అనుకూల పరిస్థితి కల్పించాలని, శక్తి ఇవ్వాలని జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామిని కోరినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో ప్రణాళిక సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ప్రజల సహకారంతో ఒక ట్రస్ట్ ఏర్పాటు చేసి జోగులాంబ అమ్మవారి సన్నిధిలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు స్థలం సేకరించామని, త్వరలో శంకుస్థాపన చేసి నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అమ్మ వారి సన్నిధి నుంచి హారతి అనంతరం భక్తులు సులభంగా తిరిగి వెళ్లేందుకు అలంపూర్ చౌరస్తా వరకు ఆర్టీసీ బస్సులు ప్రతి రోజూ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు పూర్వం మంత్రి దంపతులు కుటుంబ సమేతంగా ఆలయాలను దర్శించుకున్నారు. మంత్రి దంపతులకు ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ఆర్డీవో రామచందర్ తదితరులున్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోండి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఖాతాదారులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ దుర్గాప్రసాద్ సూచించారు. శుక్రవారం మండలంలోని మాద్వార్ గ్రామంలో బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రతి ఖాతాదారుడు రూ.436, రూ.20, రూ.1000 ఎస్‌బీఐ జనరల్ భీమా మాదిరిగా ఏపీవై చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ప్రతినిధి సురేష్‌రెడ్డి, బ్యాంకు మిత్ర గుడిసె రాజు, బాల్‌రాజ్, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

మొరాయిస్తున్న సర్వర్.. నిలుస్తున్న సేవలు



ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో తరచూ సర్వర్ మొరాయిస్తోంది. శుక్రవారం మరోమారు సాంకేతిక సమస్యతో మొరాయించి, లావాదేవీలు నిలిచిపోయాయి. సాయంత్రం వరకు ఎదురుచూసిన వినియోగదారులకు నిరాశే ఎదురైంది. సాంకేతిక సిబ్బంది, అధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువు.. ఇక కాదు బరువు



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం

గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఎరువులను మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. ఎరువుల సరఫరా కోసం ప్రస్తుతం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీగా మార్క్‌ఫెడ్ మాత్రమే వ్యవహరిస్తోంది. అన్ని ప్రాంతాలకు ఎరువుల సరఫరా సవ్యంగా జరగాలంటే మరో సంస్థకు కూడా బాధ్యతలు ఉండాలని ఆలోచించి వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరో నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం ఎంపిక చేసింది. వచ్చే యాసంగి సీజన్ నుంచి ఆగ్రోస్ నేరుగా కంపెనీల నుంచి ఎరువులు తీసుకొచ్చి రైతులకు తమ కేంద్రాల ద్వారా విక్రయించనుంది.

నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశం: రెండు దశాబ్దాల కిందట ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన ఆధునిక యంత్రాలను పరికరాలను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందు కోసం అప్పట్లో జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉండేవి. నిధుల కొరతతో అవి ప్రాభవం కోల్పోయి చివరికి మూతపడ్డాయి. సిబ్బందిని రాష్ట్ర స్థాయి కార్యాలయంలో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. ప్రస్తుతం అంపశయ్యపై ఉన్న ఈ సంస్థ ప్రాణాన్ని నిలబెట్టాలని సర్కారు యోచిస్తోంది. ఇప్పటికే ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు ఏర్పాటుకు అవకాశం కల్పించారు. నిరుద్యోగ పట్టభద్రులు వీటిని నిర్వహించేందుకు అనుమతించింది. ప్రస్తుతం వీటి ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి.

రైతులకు మేలు: మార్క్‌ఫెడ్ ద్వారానే కాకుండా ఆగ్రోస్‌తో ఎరువులను సరఫరా చేయాలని ప్రభుత్వం భావిస్తుండటం వల్ల రైతులకు మేలు జరగనుంది. తద్వారా ప్రతి గ్రామానికి సకాలంలో ఎరువులు అందనున్నాయి. అయితే ఇందుకు తగిన విధంగా ఆగ్రోస్ ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. పెద్ద ఎత్తున ఎరువుల నిల్వల కోసం గోదాములు సమకూర్చుకోవాలి. ఆగ్రోస్ ద్వారా ఎరువుల సరఫరా చేపడితే రైతులకు దూరాభారం తగ్గుతుంది. దీనివల్ల ఖర్చు సైతం ఆదా అవుతుంది. సరఫరా కేంద్రాల సంఖ్య పెరగటం వల్ల వానాకాలం యాసంగి సీజన్లలో అన్నదాతలకు సకాలంలో ఎరువులు అందుతాయని జోగులాంబ జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అంటున్నారు.

మరో నోడల్ ఏజెన్సీగా ఆగ్రోస్

ఉమ్మడి జిల్లాలో ఇలా..

- సహకార సంఘాలు: 82
- సాగు విస్తీర్ణం: 18.50 లక్షల ఎకరాలు
- ఎరువుల వినియోగం: 3.94 లక్షల మెట్రిక్ టన్నులు

21 నుంచి వ్యాసరచన పోటీలు

నారాయణపేట, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తెలుగు, ఆంగ్లం, ఊర్దూ భాషల్లో ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ యోగేశ్‌గౌతం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఠాణాల పరిధిలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిభ కనబర్చిన మొదటి ముగ్గురికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత లభిస్తుందని చెప్పారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : పది రోజులుగా హిందూ దేవుళ్లు, మందిరాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విశ్వహిందూ పరిషత్తు, భజరంగ్ దళ్, ఉత్సవ కమిటీ, లోకాయపల్లి ఆలయ ట్రస్ట్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం పేట సీఐ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దాడులకు నిరసనగా శనివారం గొడుగుగేరి హనుమాన్ మందిర్ నుంచి భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ర్యాలీ ఉంటుందన్నారు. వీహెచ్‌పీ కార్యదర్శి ప్రవీణ్ కడుదస్, ఉత్సవ సమితి అధ్యక్షుడు డా. రాంబాబు, మీలగిరి కంబ్లీ, కన్న జగదీష్ పాల్గొన్నారు.

కృష్ణజింక అప్పగింత

నర్వ, న్యూస్‌టుడే : మండలంలోని జక్కనపల్లి శివారులో గ్రామస్థులు కుక్కల దాడి నుంచి కృష్ణ జింకను కాపాడి పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై కురుమయ్య శుక్రవారం తెలిపారు. స్వల్ప గాయాలైన జింకకు స్థానిక పశువైద్య శాలలో ప్రథమ చికిత్స చేయించినట్లు చెప్పారు. వెంటనే మరికల్ అటవీశాఖ అధికారులకు అప్పగించామన్నారు.

వాలీబాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి



బహుమతి స్వీకరిస్తున్న జట్టు సభ్యులు

ధన్వాడ, న్యూస్‌టుడే : నారాయణపేటలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ధన్వాడ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ద్వితీయ బహుమతి సాధించారు. జట్టు సభ్యులను జీహెచ్ఎం గాయత్రి, పీడీ అనంతసేన అభినందించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



కేకు కోస్తున్న డీఎంహెచ్‌వో డా.సౌభాగ్యలక్ష్మి, వైద్యసిబ్బంది

నారాయణపేట, న్యూస్‌టుడే : వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డా.సౌభాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ధర్మశాల దినోత్సవం, పాలియేటివ్ కేర్ దినోత్సవం నిర్వహించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో డా.రాఘవేందర్, డీపీవో భిక్షపతి, సమన్వయకర్త వసంత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలీల సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం



ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరిస్తున్న అధికారులు

మాగనూరు, న్యూస్‌టుడే : ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం ఇక నుంచి గ్రామ స్థాయిలోనే జరిగేలా చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో రహ్మతుద్దీన్ తెలిపారు. శుక్రవారం మాగనూరు మండలం నేరేడ్‌గంలో కూలీల జాబ్ కార్డులను సవరించారు. కొత్త జాబ్ కార్డుల జారీ ప్రక్రియనూ గ్రామంలోనే నిర్వహించారు. ఏపీవో హర్షవర్ధన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అర్జున్, క్షేత్ర సహాయకుడు కురుమప్ప తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలి

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మరికల్ పట్టణంలోని ఓ పాఠశాలలో ప్రతి తరగతి నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులతో స్కూల్ ఎర్త్ క్లబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మొక్కలు పెంచే విధానాన్ని వివరించారు. రాఘవేంద్ర, రాజేష్‌యాదవ్, కరస్పాండెంట్ పూర్ణిమ, వెంకటేశ్వరశర్మ, ప్రధానోపాధ్యాయురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని రెండో ఎస్సై ఆచారి సూచించారు. శుక్రవారం ఠాణా వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బలరాం, నరేష్, శ్రీహరి పాల్గొన్నారు.

స్తంభం ఎక్కాలంటే ఈదాల్సిందే!



భారీవర్షానికి 11 కేవీ తీగలు తెగిపడటంతో సిబ్బంది సాహసంతో సరిచేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లింగాల-చెన్నంపల్లికి సంబంధించిన 11 కేవీ లైన్ తీగలు తెగిపడటంతో విద్యుత్తు సరఫరా నిలిచింది. రంగసముద్రం కుంట మధ్య నీటిలో ఉన్న స్తంభం వద్ద తీగలు సరి చేయాల్సి ఉండటంతో సిబ్బంది దేవేందర్, లింగం నాయక్ ఈదుతూ వెళ్లి మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఉన్నతాధికారులు వారిని అభినందించారు. - న్యూస్‌టుడే, లింగాల

11కేవీ లైన్ సాంకేతిక లోపాలు సరిచేస్తున్న విద్యుత్తు సిబ్బంది దేవేందర్

దారి ఇలా... వెళ్లేదెలా...



కోస్గి నుంచి ముంగిమళ్ల గ్రామానికి వెళ్లే దారిదీ. కొన్నేళ్లుగా ఈ మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు తారు రోడ్డు వేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోస్గి గ్రామీణం

గేటుకు మరమ్మతులు

మక్తల్ గ్రామీణం: మండలంలోని గుడిగండ్ల గ్రామ సమీపంలో రైల్వే వంతెన వద్ద ఉన్న గేటును లారీ ఢీకొట్టడంతో విరిగింది. శుక్రవారం రైల్వే అధికారులు గేటుకు మరమ్మతులు చేశారు. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రాంప్రసాద్, సిబ్బంది చెన్నప్ప, సత్తిబాబు, పరుశరాం, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మండలంలోని పేరపళ్ల విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రామీణ ఏఈ సాయినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా శ్యాసన్‌పల్లి, మీది తండాలకు సరఫరా ఉండదన్నారు.